
రైతుబీమాతో భరోసా



2



ఘన్‌పూర్ రైల్వే గేటు బంద్

AKSHARA TODAY

అక్షర నేటిడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com

పీసీసీ చీఫ్‌కు ఘన సన్మానం



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారుఆయన పీసీసీ చీఫ్‌గా రెండేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా సన్మానించారు. భవిష్యత్తులో పీసీసీ చీఫ్ గా తీసుకునే నిర్ణయాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని నగేష్ రెడ్డి పేర్కొన్నారు.

22-9-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2



మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : గణేష్ బిగాల

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల డిమాండ్ చేశారు. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికులు ధర్నా చౌక్ లో చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు, లైన్‌మెన్లు, పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, వాటర్ సెక్షన్ సిబ్బంది గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వ స్పందించకపోవడం విచారకరమన్నారు. మున్సిపల్ కార్మికులు తన కుటుంబ సభ్యులతో సమానమని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.19,500 వేతనాన్ని పెంచి, కనీస వేతనంగా రూ.26,000 అందించాలని కోరారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే వారి అంత్యక్రియల కోసం రూ.20,000 తక్షణ సాయం అందించాలని, అలాగే మృతుల కుటుంబ సభ్యులకు (వయోపరిమితి సడలించి) ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, నవీద్ ఇక్బాల్, జగత్ రెడ్డి, అబ్దుల్ మతిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యాలయాలు : రాకేష్ రెడ్డి



అక్షరటుడే,ఆర్మూర్ : అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే దగ్గర అందుబాటులో ఉండేలా డిజైన్ చేస్తున్నట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ ముందున్న వ్యవసాయ మార్కెట్ స్థలాన్ని అధికారులు, నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్మూర్ పట్టణంతోపాటు వివిధ గ్రామాల ప్రజలు బస్టాండ్ దిగి రోడ్డు దాటేగానే అన్ని కార్యాలయాలు ఒకే వద్ద ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇక్కడి వ్యవసాయ మార్కెట్ యార్డును ఆర్మూర్ మున్సిపల్ శివారులో ని డిగ్రీ కళాశాల ప్రాంతంలో అన్ని రకాల హంగులతో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ కు సంబంధించిన కార్యాలయాన్ని ఒకే చోట ఉండేలా ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, పట్టణ పోలీస్ స్టేషన్ అన్ని ఒకే దగ్గర ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్మూర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్ని విదాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని, మరిన్ని అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపునకు సానుకూలంగా ఉన్నారన్నారు . ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆర్మూర్ తహశీల్దార్ సత్యనారాయణ, బీజేపీ నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి, రంగన్న, పోల్కం వేణు, ఉదయ గౌడ్ పాల్గొన్నారు.

రూ.6వేలు కొట్టు..
సర్వీస్ బుక్ పట్టు..

అరకొర జీతంతో పని చేస్తున్న ఆస్పత్రి నర్సులు సర్వీస్ బుక్కు కోసం తంటాలు పడాల్సి వస్తోంది. తాము నిర్వర్తిస్తున్న విధులకు కేరాఫ్‌గా ఉండే సర్వీస్ బుక్ అంశం ఇప్పుడు నర్సుల పాలిట శాపంగా మారుతోంది. ఆ బుక్ కావాలంటే నజరానా ఇచ్చుకోవాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడటం చర్చనీయాంశంగా మారింది.

- అక్షరటుడే, కామారెడ్డి



- కామారెడ్డి జీహెచ్‌లో దర్జాగా వసూళ్లు
- నర్సుల నుంచి తీసుకుంటున్న వైనం
- గతంలో రెండుసార్లు వసూళ్లు.. ఫిర్యాదులతో డబ్బులు వెనక్కి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కామారెడ్డి జీజీహెచ్‌లో దాదాపు 200 మంది నర్సులు పని చేస్తున్నారు. వారి నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారు. వారికి న్యాయంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన సర్వీస్ బుక్ కోసం మధ్య వర్తులు, బ్రోకర్లు డబ్బులు వసూళ్లు చేస్తుండటం తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఈ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ రకమైన వసూళ్లు చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

200 మంది నుంచి..

నర్సులకు సర్వీస్ బుక్ తప్పనిసరి. ఉద్యోగంలో చేరిన ప్పటి నుంచి పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, సెలవులు, పెన్షన్ వంటి అన్నింటికీ ఈ పుస్తకమే ఆధారం. అలాంటి కీలకమైన సర్వీస్ బుక్ ఇవ్వాలంటే ఒక్కొక్కరి నుంచి రూ.6 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకోసం ఆసుపత్రిలోనే కొందరు మధ్యవర్తులు, బ్రోకర్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని నర్సులు వాపోతున్నారు.

డబ్బులిస్తేనే పని..

డబ్బులు ఇచ్చిన వారికే సర్వీస్ బుక్ పని వేగంగా జరుగుతుందని, లేదంటే ఫైల్ పెండింగ్‌లో పెడతామని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. 'సర్వీస్ బుక్ కావాలంటే 6 వేలు ఇవ్వాల్సిందే' అని తేల్చి చెబుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో నర్సులు డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమవుతు న్నారు. తమ వద్ద నుంచి ఇలా వసూలు చేయడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షల్లో వసూళ్లు..?

ప్రస్తుతం జీజీహెచ్ లో 205 మంది నర్సులు పని చేస్తున్నారు. వీరి వద్ద సర్వీస్ బుక్ కోసం ఒక్కొక్కరి వద్ద రూ.6 వేలు చొప్పున వసూలు చేస్తే దాదాపు రూ.12 లక్షలకు పైమాటే. గత రెండు నెలల క్రితం సర్వీస్ బుక్ పేరుతో 164 మంది నర్సుల నుంచి వసూళ్లు చేయగా, ఫిర్యాదుల నేపథ్యంలో వసూలు చేసిన మొత్తాన్ని ఫోన్ పే, నగదు రూపంలో తిరిగి ఇచ్చేశారు. అయినా మళ్లీ ఇప్పుడు అదే వసూళ్ల పర్వం మొదలవ్వడం వెనుక వైద్యాధికారుల పాత్ర ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా వసూళ్ల నెట్‌వర్క్..

కామారెడ్డిలోనే కాదు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఇదే తరహా వసూళ్లు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీని వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందా? పైస్థాయి అధికారుల అండదండలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు వచ్చినా కేవలం డబ్బులు వెనక్కి ఇప్పించి చేతులు దులుపుకోవడం వెనుక మతలబు ఏంటని నర్సులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాల్సిన సర్వీస్ బుక్ కోసం నర్సుల నుంచి బహిరంగంగా వసూళ్లకు పాల్పడుతున్న వారిపై జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపాలని నర్సులు కోరుతున్నారు. డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ముచ్చటగా మూడోసారి..

ఇలా వసూళ్లకు పాల్పడటం ఇదే మొదటిసారి కాదు. ఇది ముచ్చటగా మూడోసారి. గతంలో కూడా రెండుసార్లు ఇదే తరహాలో వసూళ్లకు పాల్పడ్డారు. ఫిర్యాదులు రావడంతో డబ్బులు వెనక్కి ఇచ్చి సరిపెట్టారు తప్ప, బాధ్యులపై ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోలేదు. దీంతోనే మళ్లీ అదే దందా యథేచ్ఛగా కొనసాగుతోందని నర్సులు ఆరోపిస్తున్నారు.

సెయింట్ లూయిస్ సిటీలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సందర్శన

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో సెయింట్ లూయిస్ సిటీలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌ను తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్ సందర్శించారు. అక్కడ రెడ్ క్రాస్ సేవల గురించి తెలుసుకున్నారు. ప్లేట్‌లెట్స్ కలెక్షన్ బాగుందని..యువతీయువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేస్తున్నారని ఆయన వివరించారు. 60సవంత్సరాలు దాటినా వారు సైతం ఉత్సాహంగా ఈ కార్యక్రమానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీలో రెడ్ క్రాస్ సేవలు, తలసేమియా, ప్లేట్ లెట్స్, ఓల్డ్ ఏజ్ హోమ్, సిపిర్ ట్రైనింగ్, జూనియర్ రెడ్‌క్రాస్ గురించి అక్కడి సభ్యులకు వివరించామన్నారు. తాను 87సార్లు రక్తదానం చేసినందుకు సెయింట్ లూయిస్ రెడ్‌క్రాస్ సభ్యులు అభినందించడం సంతోషంగా ఉందన్నారు.



నగరంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్



అక్షరటుడే నిజామాబాద్ క్రైం: నగరంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 11గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ అమలులో ఉంటుందని సీపీ తెలియజేశారు. హైదరాబాదు నుండి నిజామాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మాధవ నగర్ బైపాస్, కంఠేశ్వర్ బైపాస్, రైల్వే అండర్ పాస్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ గుండా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాల్సి ఉంటుంది. బోధన్ నుంచి వచ్చే వాహనాలు అర్సపల్లి చౌరస్తాలో ఎడమవైపు తిరిగి, బైపాస్ గుండా ప్రయాణిస్తూ కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, రైల్వే అండర్ పాస్, ఎన్టీఆర్ చౌరస్తా నుండి బస్టాండ్ చేరుకోవాలి. ఆర్మూర్ వైపు నుండి నిజామాబాద్ బస్టాండ్, ఇతర ప్రాంతాలకు వచ్చేవెళ్లే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకొని అక్కడి నుండి నేరుగా రైల్వే అండర్ పాస్, ఎన్టీఆర్ 'టీ' జంక్షన్ వద్ద కుడి వైపుకు తిరిగి, రైల్వే స్టేషన్ ముందరి నుండి బస్టాండ్ చేరుకోవాలి. బాస్వాడ, వర్ని వైపు నుంచి వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు వర్ని చౌరస్తా వరకు చేరుకొని అక్కడి నుండి కుడి వైపుకు తిరిగి ఆర్ఆర్ చౌరస్తా గుండా పులాంగ్ చౌరస్తా, ఎల్లమ్మ గుట్ట చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా నుండి బస్టాండ్‌కు రావాలి. భారీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో నగరంలోని అనుమతించమన్నారు.

నర్సన్నపల్లిలో కలెక్టర్ పర్యటన

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం పర్యటించారు. గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని, ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ సమయంలో ఎదురైన ఇబ్బందులు, ప్రభుత్వం నుంచి అందిన సహాయంపై ఆరా తీశారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, రికార్డుల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, రికార్డులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బోధన, మధ్యాహ్న భోజన నాణ్యత, యూనిఫాంలు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థుల అవసరార్థం అదనంగా రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ హిమబిందు, ఎంపీడీవో హెప్సిబా రాణి, డీఈవో మల్లికార్జున్, ఎంఈవో ఎల్లయ్య, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.



కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిశీలించిన రైల్వే జీఎం

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ప్రత్యేక తనిఖీ రైలులో కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు రైల్వే అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కామారెడ్డి రైల్వే స్టేషన్‌తో పాటు పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను జీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైళ్ల రాకపోకలను మరింత సురక్షితంగా, క్షేమంగా నిర్వహించేందుకు చేపడుతున్న కవచ్ సాంకేతిక వ్యవస్థ అప్‌గ్రేడేషన్ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కవచ్ వ్యవస్థ ద్వారా రెండు రైళ్లు ఎదురెదురు వచ్చినా, సిగ్నల్‌ను దాటినా ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి ప్రమాదాలను నివారించే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ స్టేషన్ పథకం కింద కామారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి రైల్వే స్టేషన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, ఆధునిక వెయిటింగ్ హాల్స్, ప్లాట్ ఫాంల ఆధునికీకరణ, లిఫ్టులు, ఎస్కలేటర్లు, పార్కింగ్ సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కామారెడ్డి ప్రాంతంలో రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీఎం తెలిపారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా, సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.





అభివృద్ధి బాటలో ముచ్కూర్

అక్షరటుడే, భీమ్‌గల్: ముచ్కూర్ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన ముచ్కూర్ గ్రామంలో పర్యటించి, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీవో జి.నర్సయ్య, సర్పంచ్ కొడిగెల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమేష్ పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ విశ్వవిద్యాలయంగా మారాలి



అక్షరటుడే, లింగంపేట : మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల విశ్వవిద్యాలయంగా మారాలని ప్రముఖ హైకోర్టు న్యాయవాది మోహిన్ అహ్మద్ ఖాద్రీ అన్నారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మతం కన్నా మానవత్వం గొప్పదని పేర్కొన్నారు. లింగంపేట్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల భవనానికి ఒక పోర్షన్ అయ్యే ఖర్చు రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. తన సొంత ఊర్లో ఒక మంచి విద్యాలయం ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులకు, ప్రబంధకారుని సభ్యులను అభినందించారు. ఆయనను పాఠశాల నిర్వాహకులు సన్మానించారు.

రైతు కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోయిన వారికి రైతుబీమా పథకం మరోసారి భరోసాగా నిలవనుంది. రైతు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం బాధిత కుటుంబాలకు ఊరటనిచ్చింది. రైతు మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించడం ద్వారా ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందుతోంది.
– అక్షరటుడే, ఎల్లారెడ్డి



రైతుబీమాతో భరోసా

■ బాధిత రైతు కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నవైనం ■ కొనసాగింపునకు ప్రభుత్వం ఆమోదం.. ■ పాత నమోదుదారులకే పరిహారం

వ్యవసాయ భూమి కలిగి ఉండి 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న పట్టాదారులు రైతుబీమా పథకానికి అర్హులుగా ఉన్నారు. రైతు మరణించినప్పుడు కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆలస్యం లేకుండా ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2018 ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకంలో ఏటా అర్హులైన పట్టాదారులను నమోదు చేస్తూ వచ్చారు.

గడువు ముగియడంతో..

రైతుబీమా పథకం ప్రస్తుత గడువు ఆగస్టు-13తో ముగియడంతో తదుపరి పరిస్థితిపై రైతు కుటుంబాల్లో కొంతకాలంగా అయోమయం నెలకొంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడంతో పథకం కొనసాగుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. తాజాగా గతంలో నమోదైన రైతులకు బీమా ప్రయోజనం కొనసాగించేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో బాధిత కుటుంబాలకు ఊరట లభించింది.

కొత్తగా నమోదుకు అవకాశం లేదు

ప్రస్తుతం పాత నమోదుదారులకే పథక ప్రయోజనం వర్తించేలా నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. కొత్తగా రైతుబీమాలో చేరేందుకు మాత్రం ప్రస్తుతం అవకాశం కల్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో ఇందిరమ్మ బీమా పేరుతో కొత్త పథకాన్ని తీసుకురావాలనే ఆలోచనలో ఉండటంతో దాని విధివిధానాల రూపకల్పనలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. అప్పటివరకు పాత రైతుబీమాను కొనసాగించే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

బాధిత కుటుంబాల నుంచి దరఖాస్తులు

రైతుబీమాలో ఇప్పటికే నమోదై ఉన్న రైతులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నిబంధనల ప్రకారం పరిశీలన పూర్తయిన అనంతరం రూ.5 లక్షల పరిహారం అందించనున్నారు. జిల్లాలో రైతుబీమా పథకంలో 1,98,159 మంది రైతులు నమోదు కాగా, ఇప్పటివరకు 1,205 మంది రైతు కుటుంబాలు లబ్ధి పొందాయి. వారికి మొత్తం రూ.6.25 కోట్ల పరిహారం అందించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ వివరణ కోరగా.. రైతుబీమా పథకాన్ని కొనసాగించేలా నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఇటీవల చనిపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒక్కో రైతుకు రూ.2,271 ప్రీమియం

రైతుబీమా పథకంలో నమోదైన ఒక్కో రైతుకు రూ.2,271 చొప్పున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం ఎల్ఐసీకి చెల్లిస్తోంది. రైతు మరణించిన సందర్భంలో నిబంధనల ప్రకారం అర్హత ఉన్న కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుంది. ఈ పథకం ద్వారా రైతు కుటుంబాలకు ఆకస్మికంగా ఏర్పడే ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు అధిగమించే అవకాశం కలుగుతోంది.

గుంతల రోడ్డును బాగు చేసిన వీడీసీ



అక్షరటుడే, నందిపేట్: నందిపేట్ నుండి ఆర్మూర్ వెళ్లే రోడ్డు తీవ్ర గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు అధికార్ల దృష్టికి తీసుకువెళ్లిన పలితం లేకపోవటంతో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తమ సొంత నిధులతో మట్టి మోరం పోసి మరమ్మతులు చేశారు. అనంతరం వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. గత ముడు నెలల నుంచి అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి గుంతల రోడ్లను మరమ్మతులు చేయించి ప్రమాదాల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి డాక్టర్ పుణ్యరాజు శిబిరంలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారుమొతిబిందు ఉన్నవారిని గుర్తించి, శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, యాదగిరి గౌడ్, కనకయ్య గౌడ్ పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా కేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వికాస్ నగర్ మీదుగా ఆర్‌యూబీ నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ 29వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ అంజాద్ కోరారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు విజ్ఞప్తి చేశారు. జిల్లాకేంద్రంలో జనాభా వేగంగా పెరగడం, వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందన్నారు. ముఖ్యంగా రైల్వే క్రాసింగ్‌లు, ప్రధాన రహదారుల వద్ద తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వికాస్ నగర్ మీదుగా రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని తెలిపారు. ఆర్‌యూబీ నిర్మిస్తే రైల్వే క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని, అంతేకాకుండా అంబులెన్స్, ఫైర్ సర్వీస్ వంటి అత్యవసర సేవలు వేగంగా, సమర్థవంతంగా కదలడానికి వీలవుతుందని వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వికాస్ నగర్ ద్వారా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టేలా చొరవ చూపాలని కోరారు.

వినాయక నిమజ్జనానికి వసతులు కల్పించాలి

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలో ఈనెల 25 తేదీన జరగనున్న వినాయక నిమజ్జనం కోసం చెరువుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీడీవో, ఎస్సై, ప్రజాప్రతినిధులతో కలిసి నిమజ్జనం నిర్వహించే చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ నిమజ్జనం ఏర్పాటు కోసం వీధిదీపాలు, రోడ్డు చదును చేసి నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. చెరువుల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామని తెలియజేశారు. గురువారం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ



కార్యక్రమంలో ఎంపీడీవో అభినవ్ చందర్, ఎస్సై అరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో యోగాపై అవగాహన శిబిరం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ డైరెక్టర్, ఆయుష్ ఆర్‌డీడీ వరంగల్ ఆదేశాల మేరకు మంగళవారం జీజీహెచ్‌లో నర్సులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో యోగా వైద్యులు డాక్టర్ తిరుపతి యోగా విన్యాసాలు చేయించి యోగాతో కలిగే లాభాలను వివరించారు. చక్కటి ఆరోగ్యానికి యోగా ఒక్కటే పరిష్కారమని తెలిపారు. ఈ సదస్సులో నర్సింగ్ విద్యార్థినులు, ఆర్‌బీఎస్‌కే లెప్రసీ టీబీ డయాలసిస్ స్టాఫ్, ఆయుష్ ఫార్మసిస్ట్ పురుషోత్తం, యోగ శిక్షకులు, ఆయుష్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో షీ టీం అవేర్నెస్ కార్యక్రమం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్లో షీ టీం సభ్యులు మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే షీ టీంకు సమాచారం అందించాలని అన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినిలు యూనిఫాంలను ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట గాంధీ, వైస్ ప్రిన్సిపాల్ అల్తమాష్ జహంగీర్ ఉపాధ్యాయులు ప్రియదర్శిని, లక్ష్మణ్ సింగ్, సంతోషి, స్వరూప, షీ టీం సభ్యులు శ్రీశైలం, సుప్రజా తదితరులు పాల్గొన్నారు.



రెంజర్లలో రూ.35,600 పలికిన లడ్డూ

అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం ఉదయం గణపతి లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన మేదరి గంగాధర్ దంపతులు రూ.35,600లకు గణపతి లడ్డూను దక్కించుకున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల పెద్దలు ఆకుల రాజారెడ్డి, వడ్ల కిష్టయ్య, భూమారెడ్డి, లింబాద్రి, గుండ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సింగపూర్ వెళ్లిన హెచ్ఎం నివేదిక సమర్పణ



అక్షరటుడే, కామారెడ్డి: సింగపూర్ వెళ్లి వచ్చిన జడ్పీ హెచ్ఎస్ అడ్లూర్ హెచ్ఎం బండారి సుమలత అక్కడి విద్యా వ్యవస్థపై తన పరిశీలన నివేదికను మంగళవారం విడుదల చేశారు. సింగపూర్‌లోని జాతీయ విద్యా సంస్థను సందర్శించిన ఆమె, ఆ ప్రాంగణమంతా పచ్చదనంతో ఆకట్టుకుందన్నారు. 1935 నుంచి సింగపూర్ విద్యా వ్యవస్థ సాధించిన ప్రగతిని ఇతర దేశాలతో పోల్చి వివరించారని తెలిపారు. సింగపూర్‌లో ఆంగ్లం, మలయ్, మాండరిన్, తమిళం నాలుగు అధికారిక భాషలు ఉన్నా ఆంగ్లం ప్రధాన బోధనా భాషగా, మాతృభాష ద్వితీయ భాషగా బోధిస్తున్నారని పేర్కొన్నారు. బాల్య విద్య ప్రైవేటు ఆధ్వర్యంలో ఆటల ద్వారా నేర్చుకునే పద్ధతిలో నెలకు రూ.500 నుంచి రూ.వెయ్యి డాలర్ల రుసుముతో జరుగుతుందన్నారు. ప్రాథమిక విద్య ఏడేళ్లకు మొదలై 6వ తరగతి వరకు ఉంటుందన్నారు.

వినాయక నిమజ్జనం నేపథ్యంలో బైండోవర్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా పలువురిని బైండోవర్ చేశారు. ఈ మేరకు సీపీ ప్రకటన విడుదల చేశారు. వినాయక నిమజ్జనం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందస్తుగా గుర్తించి, పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సంబంధిత మండల తహశీల్దార్ల ఎదుట హాజరుపర్చి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు, ఘర్షణలు, అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నిజామాబాదు డివిజన్ వ్యాప్తంగా 280 మంది బైండోవర్ చేయగా.. ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా 175 మందిని, బోధన్ డివిజన్ వ్యాప్తంగా 117 మందిని బైండోవర్ చేశారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నిత మైన ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.

ఘన్‌పూర్ రైల్వే గేటు బంద్

అక్షరటుడే, డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ సమీపంలోని ఎల్‌సీ గేట్ నంబర్ 196ను తాత్కాలికంగా మూసివేశారు. రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా చర్యలు చేపట్టారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు అనుమతించడం లేదు. ఎల్‌సీ గేట్ నంబర్ 196(కిలోమీటర్ 473/700 800) వద్ద గేట్ లాడ్జి తరలింపు, డబుల్ లైన్ ఏర్పాటుతో పాటు ట్రాక్ లింకింగ్ పనులు చేపట్టనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు సుమారు రెండు రోజుల పాటు గేట్‌ను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో ఘన్‌పూర్ నుంచి డిచ్‌పల్లి స్టేషన్ రోడ్డు వైపు ఎల్‌సీ గేట్ మీదుగా రహదారి రాకపోకలకు అనుమతి ఉండదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. వాహనదారులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు. రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ముద్‌ఖేడ్ - మేడ్చల్ మార్గంలో వంతెనలు, ఆర్‌యూబీలు, విద్యుదీకరణ, సిగ్నలింగ్ తదితర పనులు కొనసాగుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

